క్లుప్తంగా

ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న శాంతిరెడ్డి కుమార్తె వివాహానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. శాంతిరెడ్డి కుటుంబ సభ్యులు అనిల్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞలు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మండల పరిధిలోని బృందావన్ టీచర్స్ కాలనీలో ఆదివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అమీన్‌పూర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశం, కార్యదర్శిగా నాగభూషణం, కోశాధికారిగా రమేష్, గౌరవాధ్యక్షుడిగా ప్రభాకర్, అసోసియేన్ అధ్యక్షుడిగా లింగంతోపాటు సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కరపత్రాల పంపిణీ

మునిపల్లి(అందోల్): నర్సాపూర్ మండలం నృసింహపురం ఆత్మానందాశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి వెంకటస్వామి ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం మండలంలోని తాటిపల్లి, మక్తక్యాసారం, గార్లపల్లి, పెద్దలోడి, బుదేరా, కంకోల్, చిన్నచల్మెడ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో లక్ష దీపోత్సవ కరపత్రాలను భక్తులు మల్లన్న, విఠల్, గోపాల్ పంపిణీ చేశారు. 23వ తేదీ నుంచి 27 వరకు సుప్రభాత సేవ, గణపతి పూజ, గురుపూజ, శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి వారికి అభిషేక నిర్వహించడం జరుగుతుందన్నారు. 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు లక్ష దీపోత్సవం జరుగుతుందని ఆశ్రమ అధ్యక్షుడు గుర్రాల భాను ప్రకాశ్ తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలు పక్కా

జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్

న్యాల్‌కల్(జహీరాబాద్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతుందని మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్ అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని డప్పూర్ గ్రామానికి చెందిన కిరణ్ గౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేసే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు. పార్టీలో చేరికల సందర్భంగా ముంగి చౌరస్తా నుంచి డప్పూర్ వరకు పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ముంగి, న్యాల్‌కల్, అత్నూర్ మీదుగా డప్పూర్ వరకు కొనసాగింది.


డప్పూర్‌లో కిరణ్‌గౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రశేఖర్

కాంగ్రెస్‌లో చేరిక

కోహీర్(జహీరాబాద్): కోహీర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, బడంపేట శ్రీ రాచన్న స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాచూరి కనకరత్నం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం ఆయన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్‌రావు సమక్షంలో ఆయనతో పాటు పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పార్టీలో చేరారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు


మొగుడంపల్లిలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కాంగ్రెస్ వస్తేనే ప్రజల జీవితాల్లో వెలుగులు: చంద్రశేఖర్

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయని జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్, సజ్జారావుపేట తండా, విఠునాయక్ తండా, మిర్జంపల్లి తండా, హరిచంద్‌నాయక్ తండా, ఉప్పర్‌పల్లి తండా, జాంగార్‌బౌలి తండా, పర్వతాపూర్, రాయిపల్లితండా, ఇప్పెపల్లి, గౌటిగార్‌పల్లి, ఖాంజమాల్‌పూర్, గోపన్‌పల్లి, అసద్‌గంజ్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం చేపట్టగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ప్రభుత్వం మారాలని, అది కాంగ్రెస్ పార్టీ వస్తేనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పేదలకు అండగా ఉండే పార్టీ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో పేదలు అనేక ఇబ్బందులుపడుతున్నారన్నారు.

చంద్రశేఖర్ కుటుంబం ఎన్నికల ప్రచారం



జహీరాబాద్: జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చంద్రశేఖర్ గెలుపు కోసం ఆయన కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని చిరాగ్‌పల్లిలో చంద్రశేఖర్ సతీమణి ప్రమీల, కుమార్తె ఆశాజ్యోతి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచారు. ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

నేత్రపర్వంగా శ్రవణ నక్షత్ర మహోత్సవం


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రంలోని వెంకటేశ్వరాలయంలో ఆదివారం శ్రవణ నక్షత్ర మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో అర్చకులు తెల్లవారుజామున స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరి ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన నిర్వహించామన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం బాలికలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాస్టర్ జైపాల్ ఆధ్వర్యంలో బాలికలు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాంత, సంఘం సభ్యులు ఏసు, జ్ఞానప్రకాశ్, భూషణం, అనురాధ, జ్యోతి, సునీత, జైల్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు

శివ్వంపేట(నర్సాపూర్): పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. ఆదివారం మండలంలోని గోమారం, సికింద్లాపూర్, చండీ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్ఐ కిషన్‌తో కలిసి పరిశీలించారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌కు సంబంధించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలో ఉన్న 55 పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతి, టాయిలెట్స్, ఫర్నిచర్, విద్యుత్, ర్యాంపులు ఇతర వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

బీఆర్ఎస్‌ను గెలిపించండి

- ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు
- ఇంటింటి ప్రచారంలో అభ్యర్థన

జహీరాబాద్: ప్రజా సంక్షేమం కోసం ప్రజలంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలోని అల్లీపూర్, ఫయాజ్‌నగర్, నేతాజీనగర్, మూసానగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే పేదల కష్టాలు తీరుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను నమొద్దన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేక పోయారని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అత్యధికంగా ప్రజా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. దీంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

మార్వాడీలతో సమావేశం

మార్వాడీలతో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఐడీసీ చైర్మన్ తన్వీర్ సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. జహీరాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం మార్వాడీలు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి తమ మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

ఆయా పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఝరాసంగం మండలంలోని చిల్కేపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఐడీసీ చైర్మన్ తన్వీర్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ సమక్షంలో సత్యనారాయణరెడ్డి, అంజిరెడ్డి, వెంకటేశం, రాములు,బస్వరాజ్, లక్ష్మారెడ్డిలు బీఆర్ఎస్‌లో చేరారు. జహీరాబాద్ మండలం హోతి(కె) గ్రామానికి చెందిన రాకేష్, రాజు, వినోద్, సాయినాథ్‌లు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.గుండప్ప, వెంకటేశం, సంగమేశ్వర్, మచ్చేందర్, తట్టు నారాయణ, శంకర్ నాయక్, హీరూ రాథోడ్, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన చిల్కేపల్లి గ్రామస్తులు


సీడీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


బీఆర్ఎస్‌లో చేరిన హోతి వాసులు

పాటల సీడీ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: గిరిజన నాయకులు రూపొందించిన పాటల సీడీని ఆదివారం ఎమ్మెల్యే మాణిక్ రావు ఆవిష్కరించారు. ఎమ్మెల్యేపై ఉన్న అభిమానంతో బీఆర్ఎస్ ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ పవార్, కోహీర్ మండల అధ్యక్షుడు వాసునాయక్ పాటల సీడీని రూపొందించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, బీఆర్ఎస్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాదరక్షలు వేసుకోను


పాదరక్షలు లేకుండా ప్రచారంలో పాల్గొన్న బండిమోహన్

జహీరాబాద్: ఎమ్మెల్యే మాణిక్‌రావు గెలిచే వరకు పాదరక్షలు వేసుకోబోనని జహీరాబాద్ పట్టణం బాగారెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ నేత బండి మోహన్ ప్రతిజ్ఞ చేశాడు. ఆదివారం పాద రక్షలు లేకుండానే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. మాణిక్‌రావు గెలిస్తే జహీరాబాద్ పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్ పట్టణంలో అభివృద్ధి కుటుపడిందని ఆరోపించారు. మురికి కాల్వలు, మౌలిక వసతులు లేక పట్టణ ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా మాజీ ఎంపీ, సీడబ్ల్యూసీ సభ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆదివారం పట్టణంలో ప్రచారం చేశారు. ఇంటింటి ప్రచారంలో మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోశ్, ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి అనులేక, నాయకులు ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్‌గుప్తా, చిన్న అంజిగౌడ్, అశోక్, ఉదయ్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపే ప్రజలు

హత్నూర(సంగారెడ్డి): తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రం హత్నూర గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ సత్యవతి భర్త పెంటేశ్ బీఆర్ఎస్ నుంచి రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రెండుసార్లు కేసీఆర్‌ను నమ్మి ఓట్లేసి మూడోసారి మోసపోయి ఎందుకు ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నాయకురాలు సువాసినిరెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హకీం, దౌల్తాబాద్ సర్పంచ్ వెంకటేశం, నాయకులు అల్తాఫ్, పెంటయ్య, అందానగరం గోపాల్, రాములు, లతీఫ్, ఖదీర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌లో ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి, పార్టీ నాయకులు


కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న రాజిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్ నగర్ పంచాయతీలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాఘు, ఉపసర్పంచ్ ఫారూక్ తదితరులు చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆవులు రాజిరెడ్డిని గెలిపించాలని కోరారు.ఆరు గ్యారంటీ స్కీంలు అమలు చేసి ప్రజలను ఆదుకుంటుందని తెలిపారు. శేరితండాలో బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బీఆర్ఎస్ రోడ్ షోకు భారీ స్పందన
- ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం
- పూల వర్షం కురిపించి అభిమానం చాటుకున్న ప్రజలు

పటాన్‌చెరు: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్ గూడ, కిష్టారెడ్డిపేట గ్రామాల పరిధిలోని వివిధ కాలనీల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శనివారం రాత్రి నిర్వహించిన రోడ్ షోకు అద్భుతమైన స్పందన లభించింది. దారి పొడవునా తమ అభిమాన నేతకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. ఓ వైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను జోడెద్దుల్లా పరిగెత్తిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుపుతున్నారని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం కేటాయించకుండా వివక్షత చూపుతోందని విమర్శించారు.


రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో..

పటాన్‌చెరు: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఆదివారం మధురానగర్, శ్రీ సాయిరాం నగర్ తదితర కాలనీల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

వన భోజన కార్యక్రమంలో..

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడలో శెట్టి బలిజ సంఘం కార్తీక వన భోజనం కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రజలందరూ ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశంలో 18 శాతం ఉన్న పద్మశాలీలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి రామచంద్రాపురం పట్టణంలోని లక్ష్మి గార్డెన్‌లో జరిగిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కుల సంఘాల కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పద్మశాలీల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గాన్ని రూ.వేల కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా ఆధునీకరణ, డ్రైనేజీ ఆధునీకరణ, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల విజ్ఞప్తి మేరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే పలుచోట్ల తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే తనను మరోసారి మూడోసారి గెలిపించాలని కోరారు.

అభివృద్ధిని చూసే చేరికలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు సంజీవ్, బీఎస్పీ నాయకుడు సోహైల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంకర్ తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

మూడోసారి గెలిపించండి

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యేను ముచ్చటగా మూడోసారి గెలిపించాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గోనెమ్మ బస్తీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో పాటు, ఎమ్మెల్యే ప్రవేశపెట్టిన నవరత్నాల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.


పద్మశాలీల భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సంఘం సభ్యులు


గోనెమ్మ బస్తీ ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్

బీరప్పబస్తీలో ప్రచారం


బీరప్ప బస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్పబస్తీలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్ రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ చంద్రారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్య, స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, రాజ్‌గోపాల్, మాహిళలు, ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పటాన్‌చెరు టౌన్: బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ పరిశ్రమ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం పటాన్‌చెరు మండలంలోని పారిశ్రామికవాడలో ఈనెల 13వ తేదీన ఆదిత్య ఫార్మా పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. గాయపడ్డవారు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో మహేష్ సింగ్(22) శనివారం రాత్రి మృతి చెందాడు సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బీఎస్పీలోకి చేరికలు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, ఇతర పార్టీల నాయకులు బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి నీలం మధు సమక్షంలో ఆదివారం బీఎస్పీలో చేరారు. జిన్నారంలోని మహిళా నాయకురాలు నీలం లత ఆధ్వర్యంలో మహిళలు, మంగంపేట బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం

జహీరాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం అల్గోల్, దిడిగి, బూర్దిపాడ్ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పార్టీ మేనిఫెస్టో వివరించారు. బీజేపీని గెలిపిస్తే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. ప్రచారంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


ఎద్దు మృత కళేబరం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం మాద్వార్ తండాలో ఎద్దు ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. బిల్యానాయక్ తన పశువులను మేత కోసం పొలానికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురై ఎద్దు అక్కడిక్కడే మృతిచెందింది. ఎద్దు మృతిచెందడంతో దాదాపు రూ.70 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.